క్లుప్తంగా

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

వనపర్తి రూరల్: వనపర్తి, నాగవరం సింగిల్ విండో కార్యాలయంలో 50 శాతం సబ్సిడీతో అందజేయనున్న జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ కురుమయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.4275 కాగా సబ్సిడీపై రూ.2137.50, జనుము విత్తనాలు 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.5020 కాగా సబ్సిడీపై రూ.2510 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

అమరచింత: అకాల వర్షాలతో మామిడి పండ్లు రాలి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మాపురంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని లేని పక్షంలో రైతు తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ఎఐకేఎస్ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవేందర్, మహేందర్, శ్రీను పాల్గొన్నారు.

ఏసీపీ సుదర్శన్‌కు సత్కారం

అమరచింత: పట్టణానికి చెందిన సుదర్శన్ గోషామహల్ ఏసీపీగా బాధ్యతలు తీసుకోవడంతో పట్టణానికి చెందిన ఆయన స్నేహితులు, యువకులు కలిసి అభినందించారు. పట్టుదలతో చదివి ఎస్ఐగా ఉద్యోగం సాధించి ప్రస్తుతం ఏసీపీగా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించి పట్టణానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. అనంతరం ఏసీపీ సుదర్శన్‌కు శాలువాతో సత్కరించి బొకేను అందించారు.

నిందితులను గుర్తించకపోవడం దారుణం

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీధర్‌రెడ్డి హత్య జరిగిన ఏడాది గడుస్తున్నా నేటికి నిందితులను గుర్తించడంలో అధికారులు విఫలమవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపల్లిలో నిర్వహించిన లక్ష్మీరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గోవిందురెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి, గోవిందు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, వెంకట్రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: పొలం విషయం ఘర్షణలో దాడి చేసిన ఘటనపై శుక్రవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన భూతగళ్ల స్వామి ఇదే గ్రామానికి చెందిన భూతగళ్ల పెద్ద నాగయ్య, భూతగళ్ల రమేష్, భూతగళ్ల చిన్ననాగయ్య, భూతగళ్ల శివ పొలం విషయంలో కొన్నేళ్లుగా ఘర్షణ పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భూతగళ్ల స్వామి సర్వే నంబర్ 609/38లోని పొలంలో ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా పైన సూచించిన నలుగురు బూతులు తిడుతూ రాళ్లు, బీరు సీసాలను దాడి చేయడంతో స్వామి కుడికాలు, మెడపై రక్తగాయాలయ్యాయి. ఈ క్రమంలో బాధితుడు స్వామి పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కారు డ్రైవర్‌పై ఫిర్యాదు

పాన్‌గల్: ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై శుక్రవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం కొల్లాపూర్ నుంచి వనపర్తికి వెళ్తున్న క్రమంలో కేతేపల్లి గ్రామ సమీపంలో వనపర్తి నుంచి కొల్లాపూర్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతింది. ఇట్టి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ విజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ బస్సు డ్రైవర్ శేఖర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు కరువయ్యాయని వెంటనే వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. తరగతి గదులకు తలుపులు, కిటికీలు లేక గదులు కూడా అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. పాఠశాలలు తెరవక ముందే వసతులు కల్పించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అందుబాటులో అందరికీ వైద్యం



వీపనగండ్ల కమ్యూనిటీ సెంటర్

- వీపనగండ్ల సీహెచ్‌సీపై ప్రజల ప్రశంసలు
- మూడు నెలల్లో 4,153 మందికి రోగనిర్ధారణ పరీక్షలు
- 40 గ్రామాల ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స, మందుల పంపిణీపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ, ప్రయాసల బాధలు లేకుండా వైద్యం అందుబాటులో ఉండటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉమ్మడి మండలంలోని చిన్నంబావి, వీపనగండ్ల మండలాలతోపాటు పెంట్లవెల్లి మండలంలోని దాదాపు 40 గ్రామాల ప్రజలు వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు.

విస్తృతంగా రోగ నిర్ధారణ పరీక్షలు

గడిచిన మూడు నెలల్లో హెల్త్ సెంటర్‌లో 4,153 మంది రక్త నమూనాలను సేకరించి రోగ నిర్ధారణకు జిల్లా కేంద్రంలోని డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపించారు. అదే విధంగా ఆస్పత్రిలో సేకరించిన రక్త నమూనాలను ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి పంపించి సీబీపీ, హెచ్‌బీ, హెచ్ఐవీ, ప్రెగ్నెన్సీ, కంప్లీట్ బ్లడ్, యూరిన్ టెస్ట్, హెచ్‌బీ–ఏ, 1సీ, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధి నిర్ధారణ ఫలితాలు వేగంగా అందజేస్తున్నారు. టీబీ నిర్ధారణ పరీక్షలకు ట్రూనాట్ యంత్రం అందుబాటులో ఉండటంతో వైద్య పరీక్షలు విస్తృతంగా చేస్తున్నారు.గత ఈ మూడు నెలల కాలంలో 167 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇందులో 12 మందికి క్షయ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారికి అవసరమైన మందులతోపాటు నిక్షయ్ పోషణ్ పథకం కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1,000 చొప్పున ఆరు నెలల పాటు ఆర్థిక సహాయం అందుతుంది. దీంతో క్షయ రోగులకు ఇట్టి డబ్బులు ఎంతో ఆసరాగా నిలుస్తుంది.

వైద్య సేవలపై ప్రచారం

ఆస్పత్రి సిబ్బంది సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న సేవలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆశా వర్కర్లు, అంగన్‌వాడలతో ఊరూరా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో చుట్టుపక్కల మూడు మండలాల ప్రజలు ఆస్పత్రి సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోకుండా వైద్య సేవలు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

గర్భిణులకు అధిక ప్రయోజనం



మహిళలకు, వృద్ధులకు రోగ నిర్ధారణ పరీక్షలు స్థానిక ఆస్పత్రిలో అందుబాటులో ఉండంతో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. గర్భిణులు ముఖ్యమైన వైద్య పరీక్షల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే పరీక్షలు నిర్వహిస్తుండటంతో వారి వ్యయ ప్రయాస బాధలు తప్పుతున్నాయి.

– సుగుణబాయ్ అంగన్వాడీ టీచర్ వీపనగండ్ల

సేవా భావంతో పనిచేస్తున్నాం



ఆస్పత్రిలో సేవా భావంతో చేస్తున్నాం. సుదూర ప్రాంతాలకు వెళ్లలేని కొందరు ఆస్పత్రిలో రక్త నమూనాలను అందజేస్తున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఆస్పత్రిలో అందుబాటులో ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్, సీహెచ్‌సీ

సేవలపై విస్తృత ప్రచారం

సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న సేవలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లోని ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఆస్పత్రిలోని వైద్య సిబ్బందిని సమన్వయపరచి రక్త నమూనాల సేకరణ, టీబీ పరీక్షల నిర్ధారణలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం.

– చైతన్యగౌడ్ టీసీహెచ్ఎస్ వనపర్తి

విద్యా సామర్థ్యాలు పెంచేందుకే శిక్షణ


పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచేందుకే ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల నాల్గవ రోజు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడు అంటే నిత్య విద్యార్థి అన్నారు. ఉపాధ్యాయులకు తరుచుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం వలన మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వారిని సిద్ధం చేసినట్ల అవుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని బోధించే సమయంలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు మహేష్, రాకేష్, అక్తర్, జానకీరాం, మద్దిలేటి, బాలమ్మ, రాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాన్‌గల్: బోధన సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న నూతన బోధన నైపుణ్యాల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు నర్సింహ్మారావు, రాందాసు, ఆస్మానాజ్‌బేగం, రవికుమార్, బస్తీరాం, వెంకటేష్, కృష్ణ, బాలరాజు పాల్గొన్నారు.

డీకే అరుణ నియామకంపై హర్షం

ఆత్మకూర్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటీవ్ కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కేంద్రప్రభుత్వం నియమించడం పట్ల బీజేపీ రాష్ట్ర నాయకులు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి, అశ్విన్ కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. డీకే అరుణ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని అందుకు వక్ఫ్ బోర్డు బాధ్యతలే నిదర్శనమన్నారు. ఆహార ఉత్పత్తులు, ధాన్య సేకరణలో నూతన అధ్యాయాన్ని తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని పెంచుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, బంగారు భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ కోరారు. శుక్రవారం స్థానిక జాతర మైదానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. పోటీల్లో విజయం సాధించే మొదటి జట్టుకు రూ.50,116, రెండో బహుమతి రూ.30,116 నగదుతో పాటు షీల్డులను అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బంగారు ప్రకాష్, అఫ్రోజ్, అస్లాం, కోచ్ ఖాదర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


అచ్యుతాపురంలో బ్లీచింగ్ చేయిస్తున్న ఎంపీడీఓ రాఘవ

వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రాఘవ పేర్కొన్నారు. మండలంలోని అచ్యుతాపురంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని అపరిశుభ్రత వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికన్‌గున్యా బారిన పడే అవకాశం ఉందన్నారు.పంచాయతీ కార్యదర్శి రమాదేవి, టీఏ బాలయ్య, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాన్‌గల్: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ వైద్యుడు చంద్రశేఖర్, సీహెచ్ఓ రామయ్య అన్నారు. డ్రై డే ఫ్రైడేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. నీటి గుంతల్లో అబ్బెట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల వైద్యాధికారి రాజశేఖర్‌తో కలిసి కల్వరాల్లలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కలుషితం అయిన నీరు, మురుగునీటి నిల్వ వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపాలిటీ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. చెత్తను బయట పారబోయకుండా చెత్త డబ్బాల్లో వేసి చెత్తబండి వచ్చిన తర్వాత సిబ్బందికి అందజేయాలని సూచించారు. అనంతరం కుక్క కాటుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు.


ఆత్మకూరులో పారిశుద్ధ్య కార్యక్రమంలో కమిషనర్ శశిధర్

కొత్తకోట రూరల్: ప్రజలందరు డ్రైడేను విధిగా పాటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సైదయ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని 1వ, 2వ వార్డులో డ్రైడే ఫ్రైడేను నిర్వహించడంతో పాటు కుక్కకాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుక్క కాటు వేసిన చోట సబ్బుతో 10 నిమిషాల పాటు గట్టిగా ఒత్తి కడగాలన్నారు. అంతే కాకుండా దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి వైద్యుని సలహా మేరకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

వినియోగంలోకి గోదాంలు

వీపనగండ్ల: మండల కేంద్రంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలను శుక్రవారం తహసీల్దార్ వరలక్ష్మి వినియోగంలోకి తీసుకురావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా మండల కేంద్రంతోపాటు కల్వరాల్ల, సంగినేనిపల్లి, తూముకుంట తదితర గ్రామాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాంలకు తరలించకపోవడంతో ధాన్యం తడిసి మొలకలు రావడంతో పలు గ్రామాలలోని రైతులు ఆందోళనలకు దిగారు. అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు చొరవతో మండల కేంద్రంలోని గోదాంకు ఉన్న రహదారి సమస్యను పరిష్కరించడంతో తహసీల్దార్ గోదాంలో ధాన్యాన్ని నిల్వ ఉంచేందుకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ కురుమూర్తి, ఏపీఎం బిచ్చన్న, వెలుగు సీసీ వీరయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


పనులు ప్రారంభించిన అధికారులు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల గ్రామంలో రోడ్డు విస్తరణ అలాగే డ్రెయినేజీ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని 11వ వార్డులో ఇరుకు రోడ్డు, డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల్ల నర్సింహ అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ విశ్వనాథ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సునిత దయాకర్, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

అమరచింత: జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు చేపట్టిన ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందించారు. ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న టీచర్‌లను ఇంటింటికి పంపించి విద్యార్థులను జాయిన్ చేయించేలా ఒత్తిడి చేయడం సరి కాదన్నారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్య సంస్థలు అవలంబిస్తున్న విధానాలపై జిల్లా విద్య శాఖ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని నాగరాల గ్రామానికి చెందిన నలుగురు అలాగే పెబ్బేరు మండలంలో తోమాలపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు సీఎం సహాయనిది నుంచి మంజూరైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాలలో బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందరగౌడ్, రామన్‌గౌడ్ రమేష్ కుమార్, ఉమేష్‌గౌడ్ చంటి, శ్రీనివాస్‌యాదవ్, నరేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, కురుమయ్య, దస్తగిరి, నరసింహ పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన కల్పించండి

అమరచింత: నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో మెప్మా ఆర్పీలు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. అమృత్ 2.0లో భాగంగా పట్టణంలోని పెద్ద చెరువును మెప్మా సిబ్బందితో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీరు వృథా కాకుండా కాల్వల ద్వారా నేరుగా చెరువులోకి చేరే విధంగా ముందస్తు పూడిక తీత పనులు చేపడుతున్నట్లు సిబ్బందికి కమిషనర్‌కు సూచించారు.కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ యువరాజు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం, కనిమెట్ట, రామనంతాపురం గ్రామాల్లో నేడు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటెనెన్స్ పనులు జరుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: వైద్య అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన కలెక్టర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బయోమెట్రిక్‌తో పాటు మ్యాన్యువల్ హాజరు రిజిస్ట్రర్ ప్రతి నెల తన వద్దకు పంపించాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి, మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రతి నెల 400 ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే విధంగా చూడాలని సూచించారు. జిల్లాలో చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టీ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీఎస్ఎంఐ డీసీలను ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా మాతాశిశు వైద్య కేంద్రం వద్ద నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం వివిధ వార్డుల్లో సందర్శించి వైద్య సేవలపై రోగులను వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ రంగారావు, వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనులు వేగవంతం

అమరచింత: పట్టణంలో రూ.11 కోట్లతో చేపట్టిన అమృత్ 2.0 వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని దశమికట్టతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల నిర్మాణాలు బేస్ లెవల్ వరకు వచ్చినట్లు మెగా కంపెనీ మేనేజర్ సరాల శ్రీనివాసులు తెలిపారు. ఐదు లక్షల లీటర్లు, 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు వాటర్ ట్యాంకులతో పాటు పట్టణంలో 10 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పైప్‌లైన్‌తో పాటు కుళాయి కనెక్షన్‌లను రెండేళ్లలో పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తామన్నారు.

రెండు లారీల ఢీ

కొత్తకోట రూరల్: రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున కొత్తకోట మండలం రాయిణిపేట శివారులో జరిగింది. బెంగుళూర్ నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ సాంకేతిక లోపంతో ఆగిపోయింది. ఈ క్రమంలో కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్‌కు స్టీల్ లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ ముఖేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జ్ఞానదర్శిని సమన్వయకర్తలకు సన్మానం



వనపర్తి విద్యావిభాగం: ఎల్లూరు గ్రామ చరిత్ర బడి, గుడి సంస్కృతి సాంప్రదాయాలపై జ్ఞానదర్శిని పేరుతో ఎల్లూరు పాఠశాల ప్లాటినం జూబ్లీ సంచిక తీసుకురావడంలో కృషి చేసిన తెలుగు భాషోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ముఖ్య అతిథి, స్టేట్ ఆర్‌జేడీ ఏడీ అనసూయ, కోర్సు డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి ఏఎంఓ మహానందినిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. జ్ఞానదర్శిని పేరుతో తీసుకొచ్చిన ప్లాటినం జూబ్లీ సంచిక పాఠశాల విద్యా పరిస్థితులు, విద్యార్థుల ప్రగతిలో పూర్వ విద్యార్థుల అందించిన చేయూత, సంస్కృతి సాంప్రదాయాలను పుస్తకం రూపంలో తేవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పయ్యావుల కృష్ణయ్య, సువర్ణ, రమణమ్మ, పార్వతి, చెన్న పద్మ, రాజారెడ్డి, తూర్పింటి నరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.